
మంగళవారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 38.5°C | కనిష్ఠం : 22.0°C



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : బుధవారం సా : 6.31 గం..

సహర్ : గురువారం ఉ : 5.03 గం..

హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, చిత్రంలో మంత్రులు సురేఖ, సీతక్క



చేతల్లో చూపిస్తాం..

- నగరంలో పెండింగ్ పనులను పూర్తిచేస్తాం
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- రూ.60కోట్లు స్మార్ట్ మార్జిన్ నిధులు ఇచ్చేందుకు అంగీకారం
- హైదరాబాద్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు
- పాల్గొన్న మంత్రులు సురేఖ, సీతక్క ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం మాదిరిగా మాటల్లో కాకుండా చేతల్లో చూపుతామని, నగరంలోని పెండింగ్ పనులను పూర్తి చేసి అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. వరంగల్ నగరం, ముఖ్యంగా పశ్చిమ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనుల సత్వర పూర్తి, అందుకు అవసరమైన, అదనపు నిధులు మంజూరు, విడుదల తదితర అంశాలపై మంగళవారం ఆయన హైదరాబాద్ సచివాలయంలో సమావేశం నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చొరవతో జరిగిన ఈ సమావేశానికి దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్, స్త్రీ సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయతోపాటు రెవెన్యూ, దేవాదాయశాఖ, మున్సిపాలిటీ, ఆర్‌అండ్‌బీ శాఖల ప్రిన్సిపల్ సెక్రెటరీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశం మూ డు గంటల పాటు సుదీర్ఘంగా సాగగా.. వరంగల్ నగరాభివృద్ధి కోసం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

త్వరలో భద్రకాళి ఆలయ మాడవీధుల పనులు

భద్రకాళి దేవాలయం చుట్టూ మాడవీధుల నిర్మాణం లో జరుగుతున్న జాప్యంపై ప్రధాన చర్చ జరిగింది. మాడవీధుల నిర్మాణానికి గతంలోనే కుడా రూ.10కోట్లు ఇవ్వగా.. గత ప్రభుత్వం రూ.20కోట్లు మంజూరు చేసిం ది. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వమిచ్చిన రూ.20కోట్లు విడుదలవలేదు. దీనికితోడు మాడవీధుల్లో 60శాతం భూమిపై నిర్మాణం జరుగుతుండగా, మిగతా 40 శాతం చెరువు మీది నుంచి జరుగుతోందంటూ నీటిపారుదల శాఖ అనుమతులు నిరాకరిస్తోంది. అనుమతి కోసం గ్రీన్ ట్రిబ్యునల్‌కు రాశామని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నా.. ఆ దిశగా సత్వర అనుమతికి ఎలాంటి చొరవ తీసుకోవడం లేదు. దీంతో మాడవీధుల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. దీనిపై మంత్రి పొంగులేటి స్పందిస్తూ- త్వరలో మాడవీ ధుల పనులు పూర్తయ్యేలా చూడాలని కుడా అధికారులను, సమావేశం నుంచే నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి వెంటనే అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. మిగిలిన రూ.20కోట్లు వెంటనే విడుదలయ్యేట్లు చూస్తానని హామీ ఇచ్చారు. భద్రకాళి దేవస్థానం అభివృద్ధి పనులను ఆగమ శాస్త్రం ప్రకారం చేపట్టాలని, ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మాడవీధుల్లో భాగంగా తొమ్మిది అంతస్తుల రాజగోపురాన్ని, చుట్టూ రాతి బేస్‌మెంట్‌ను నిర్మిస్తామన్నారు. దీనితో పాటు ఆలయ అభివృద్ధికి అదనంగా మరికొన్ని నిధులు ఇవ్వాలని

మిగతా 8వ పేజీలో..

కరుణాపురం వద్ద రూ.60కోట్లతో వంతెన ఆమోదం

హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారి కరుణాపురం జంక్షన్ వద్ద రూ.60కోట్లతో వంతెన నిర్మాణానికి సమావేశం ఆమోదం తెలిపింది. ఈ జంక్షన్ వద్ద నిర్మించిన అండర్ బ్రిడ్జి వల్ల హైదరాబాద్ నుంచి నగరానికి వచ్చేపోయే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని నేరుగా రావడానికి వీలుగా ఇక్కడ బైపాస్ వంతెన నిర్మించాలన్న ప్రతిపాదన సమావేశంలో చర్చకు వచ్చింది. ఇందుకోసం నిట్ రూపొందించిన డిజైన్‌ను సమావేశంలో ఆమోదించారు. దీని నిర్మాణానికి అవసరమైన నిధులను వెంటనే విడుదలయ్యేట్లు చూడాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈసమావేశానికి మున్సిపల్ శాఖ సెక్రెటరీ దాన కిశోర్, దేవాదాయ శాఖ కమిషనర్ వి.అనిల్‌కుమార్, హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కమలం గూటికి అరూరి



కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ

- నేడు ఢిల్లీలో చేరికకు ఏర్పాట్లు
- అనుచరులతో సమావేశం తర్వాత రాజధానికి పయనం
- రమేష్ రాకతో బలం పెరుగుతుందని భావిస్తున్న బీజేపీ
- కడియం శ్రీహరితో టచ్‌లోకి కాంగ్రెస్?
- మారుతున్న ఓరుగల్లు రాజకీయం
- లోక్‌సభ ఎన్నికల వేళ 'గులాబీ'దళంలో అయోమయం

(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రెండు సార్లు ఎమ్మెల్యేగా, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన అరూరి రమేష్ కమలం గూటికి చేరడం ఖాయమైంది. ఈ క్రమంలోనే సీనియర్‌నేత, మాజీ డిప్యూటీసీఎం, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని చేర్చుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నట్లు వార్తలు రావడం.. ఇప్పటికే వరుస వలసలతో కుదేలవుతున్న బీఆర్ఎస్‌ను మరింత కలవరపెడుతోంది. అరూరి చేరికతో బలపడొచ్చన్న భావనలో బీజేపీ ఉండగా.. బీఆర్ఎస్‌కు ఎలాగైనా చెక్‌పెట్టాలన్న యోచనతో కాంగ్రెస్ పావులు కదుపుతుండటంతో ఓరుగల్లు రాజకీయాలు రోజురోజుకు మారుతున్నాయి. చివరగా ఏ పార్టీ నుంచి ఎవరు పోటీచేస్తారన్న దానిపై అందరిలోనూ ఉత్కంఠ కనిపిస్తోంది.

నేడు బీజేపీలోకి అరూరి

బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ బుధవారం బీజేపీలో చేరనున్నారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో పాటు పలువురు పార్టీ పెద్దలతో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో వరంగల్ ఎంపీ టికెట్‌పై బీజేపీ పెద్దల నుంచి హామీ పొందిన అరూరి రమేష్ బుధవారం వరంగల్‌లో అనుచరులతో సమావేశం నిర్వహించి, బీఆర్ఎస్‌కు రాజీనామా ప్రకటించి ఆ తర్వాత సాయంత్రానికి ఢిల్లీ వెళ్లి కాషాయ కండువా కప్పుకోబోతున్నారు. అయితే పది రోజుల కిందటే బీజేపీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకున్న రమేష్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు హైదరాబాద్ పిలిచి బుజ్జగించడంతో మెత్తబడిన రమేష్ తాను పార్టీ మారేది లేదని చెబుతూ వచ్చారు. కానీ అనూహ్యంగా ఆయన మంగళవారం బీజేపీ నేత అమిత్‌షాను కలవడం చర్చనీయాంశమైంది. ఇక రమేష్‌ను బీజేపీలోకి సాదరంగా ఆహ్వానించిన అమిత్‌షా వరంగల్‌లో బీజేపీ జెండా ఎగురవేయాలని, పార్టీలో మంచి భవిష్యత్తు ఉంటుందని భరోసా ఇచ్చినట్టు సమాచారం. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాతో పాటు పార్టీ పెద్దలను మర్యాదపూర్వకంగా కలిసే అవకాశం ఉంది. మొత్తానికి పార్లమెంట్ ఎన్నికలకు ముందు అరూరి తన 'కారు' ప్రయాణానికి ఫుల్ స్టాప్ పెట్టడం బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తుండగా.. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన అరూరి రమేష్ రాకతో తమ బలం పెరుగుతుందని బీజేపీ శ్రేణులు భావిస్తున్నాయి.

కడియం శ్రీహరికి కాంగ్రెస్‌కు ఆఫర్!



మాజీ డిప్యూటీసీఎం, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని చేర్చుకుని, వరంగల్ నుంచి పోటీకి దించాలని కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. 2014లో వరంగల్ ఎంపీగా గెలిచిన శ్రీహరికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సత్సంబంధాలున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన్ను కాంగ్రెస్‌లోకి రప్పించేందుకు సీఎం రేవంత్‌కు అత్యంత సన్నిహితుడైన ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ నేత ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. వరంగల్ ఎంపీగా కడియం పోటీ చేస్తే, ఫలితాల అనంతరం ఆయనతో స్టేషన్‌ఘనపూర్‌కు రాజీనామా చేయించి.. ఉప ఎన్నికల్లో ఆయన కుమార్తె కావ్యకు టికెట్ ఇస్తామని ఆఫర్ ఇచ్చినట్టు తెలిసింది. దీనిపై శ్రీహరితో నేరుగా చర్చలు జరపాలని కాంగ్రెస్ నేతలు నిర్ణయించినట్టు సమాచారం. కాంగ్రెస్ రెండో జాబితా బుధవారం రాత్రి లేదంటే గురువారం వెలువడే అవకాశం ఉండగా.. కడియం నుంచి అనుకూల స్పందన వస్తే వరంగల్ సీటుపై పెండింగ్ పెట్టాలని కాంగ్రెస్ యోచిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అయితే నిత్యం కాంగ్రెస్‌పై నిప్పులు చెరుగుతున్న కడియం శ్రీహరి పార్టీ మారుతారా? అనే చర్చ కూడా జరుగుతోంది.

హస్తం వైపు మేయర్ చూపు

ఇప్పటికే బల్దియాకు చెందిన కార్పొరేటర్లు పలువురు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అయితే వీరితో పాటే హస్తం గూటికి చేరేందుకు ప్రయత్నించి మేయర్ గుండు సుధారాణి రాకను జిల్లాకు చెందిన ఓ మంత్రితో పాటు పలువురు కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు అడ్డుకున్నట్లుగా ప్రచారం జరిగింది. అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేయర్ చేరికపై అభ్యంతరం చెప్పుతున్న నేతలతో మాట్లాడి ఒప్పించినట్లుగా తెలిసింది. దీంతో త్వరలోనే మేయర్ గుండు సుధారాణి కాంగ్రెస్ గూటికి చేరుతారనే ప్రచారం జరుగుతోంది. మొత్తానికి బీఆర్ఎస్‌లోని కీలక నేతలు పార్టీ మారుతుండటంపై ఓరుగల్లులో హాట్‌హాట్‌గా రాజకీయాలు మారుతున్నాయి.

పెళ్లింట విషాదం

- 16న వివాహం.. అంతలోనే మృత్యు ఒడికి వరుడు
- కెనాల్‌లో మృతదేహం లభ్యం.. ఆత్మహత్యగా అనుమానాలు



కృష్ణతేజ(ఫైల్)

వరంగల్ క్రైం, మార్చి 12: పెళ్లి బాజా మోగాల్సిన ఆ ఇంట విషాదం నెలకొంది. ఈనెల 16న పెళ్లిపీటలు ఎక్కాల్సిన వరుడు కెనాల్‌లో శవమై కనిపించాడు. హనుమకొండ గోకుల్‌నగర్‌కు చెందిన భూక్యా కృష్ణతేజ(29) ఆదివారం సాయంత్రం తన పెళ్లి కార్డులు స్నేహితులకు ఇచ్చేందుకు బైకుపై వెళ్లి.. రాత్రయినా రాలేదు. ఈ క్రమంలో సోమవారం ఉదయం కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలువేల్పుల సమీపంలోని కెనాల్ వద్ద కృష్ణతేజ బైక్ ఉన్నట్లు తెలిసింది. వెళ్లిచూసిన కుటుంబ సభ్యులు ఆ బైకు కృష్ణతేజదని గుర్తించి యువకుడి తల్లి శకుంతల కేయూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ నిర్వహిస్తుండగా.. మంగళవారం కృష్ణతేజ మృతదేహం వర్ధన్నపేట సమీపంలోని కెనాల్‌లో లభించింది. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు యువకుడి మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివాహం ఇష్టంలేక కృష్ణతేజ కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రవాహం ఎక్కువగా ఉండటంతో కృష్ణతేజ మృతదేహం వర్ధన్నపేటలో తేలిందని కేయూ ఎస్ఐ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. కేసు నమోదు చేసి విచారణ నిర్వహిస్తున్నామన్నారు.

ఏనుమాముల మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మిర్చి బస్తాలు



ధర.. దిగాలు

- ఏనుమాముల మార్కెట్లో భారీ పడిపోయిన మిర్చి రేటు
- ఆవిరైన రైతుల ఆశలు

వరంగల్ వ్యవసాయం, మార్చి 12 : గతేడాది దేశీ మిర్చికి మంచిరేటు పలకడంతో ఈ ఏడాది రైతులు ఎన్నోఆశలతో పంట సాగు చేశారు. కానీ ఆరుగాలం చెమటోడ్చిన రైతులకు తీరా పంట చేతికొచ్చాక ఆశలన్నీ ఆవిరయ్యాయి. భారీగా పతనమైన మార్కెట్ ధరలను చూసి దిగాలు చెందుతున్నారు. 2021-2022 సీజన్‌లో ఎవరూ ఊహించని విధంగా దేశీ మిర్చి క్వింటా రూ.99వేలు పలికింది. 2022-23లో అదే దేశీ మిర్చి క్వింటా రూ.80వేల దాకా అమ్ముడైంది. అయినా పరవాలేదని ఆ ధరతో మార్కెట్లో అమ్ముకోగలిగినా పెట్టుబడి పోను ఎంతో కొంత మిగులుతుందని భావించిన రైతులకు ఈ ఏడాది నిరాశే మిగిలింది. ప్రస్తుతం దేశీ మిర్చి క్వింటాకు రూ.40వేలకు మించి పలకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర రకాల మిర్చి ధరలు కూడా భారీగా తగ్గాయి. జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలు మాత్రమే మిర్చి అమ్మకానికి మంచి సీజన్ కాగా ఇప్పటికే జనవరి, ఫిబ్రవరి, మార్చి నెల సగానికి వచ్చేసింది. అయినా మిర్చి ధరలు మాత్రం పెరగడం లేదు. నెలాఖరు లేదా వచ్చే ఏప్రిల్ నెలలోనైనా ధరలు పెరుగుతాయనే ఆశ కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు.

ప్రస్తుతం మార్కెట్లో ఉన్న మిర్చి ధరలు

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో మంగళవారం నాటి మిర్చి ధరలు క్వింటాకు గరిష్ఠంగా ఇలా ఉన్నాయి. దేశీరకం మిర్చి రూ.40వేలు, తేజారకం రూ.20,200, వండర్‌హాట్ రూ.19వేలు, యుఎస్ 341 రకం రూ. 17,500, తాలు రూ.8వేలు ధర పలికింది. అయితే ఇవి గరిష్ఠ ధరలు మాత్రమే మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన వాటిలో 10నుంచి 20 శాతం వరకే ఈ ధరలు మిగితా వాటికి వచ్చే సరికి నాణ్యత సరిగ్గాలేదని గరిష్ఠ ధరల మీద రూ.ఐదారు వేల తగ్గించి వ్యాపారులు కొనుగోలు చేస్తారు. రెండు సంవత్సరాల క్రితం ఏ రకం మిర్చి ధర చూసినా క్వింటాకు రూ.20వేలకు తగ్గలేదు. దేశీ మినహా ఏ రకం మిర్చి అయినా రూ.10వేల నుంచి రూ.20వేల లోపే ధరలు పలుకుతున్నాయి.

ఎగుమతులు తగ్గడమే కారణమా..

మిర్చి ధరలు తగ్గడానికి అంతర్జాతీయ మార్కెట్‌లో ఎగుమతులు తగ్గిపోవడమే కారణమని వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి. గత సీజన్‌లో మిర్చి తీసుకుని కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకోవడంతో ధరలు తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు. డిమాండ్ అండ్ సప్లై ఆధారంగానే ధరల నిర్ణయం జరుగుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

ధరలు ఆందోళన కలిగిస్తున్నాయి



- కె.రవికుమార్, ములుగువెంకటాపూర్

మిర్చి ధరలు సగానికి సగం తగ్గిపోయాయి. సాగు ఖర్చులు బాగా పెరిగిపోయాయి. విత్తనాలు వేయడం నుంచి పంట చేతికి వచ్చే సరికి కూలీలకు, ఎరువులకు, క్రిమిసంహార మందులకు ఇలా అన్నింటికి రేట్లు పెరిగాయి. కానీ పంటలకు మాత్రం ధరలు పెరగడం లేదు. ఈ ప్రభుత్వమైనా స్పందించి రైతుల పెట్టుబడి పోను లాభం వచ్చేలా గిట్టుబాటు ధరలు నిర్ణయించి ప్రభుత్వ సంస్థలతో కొనుగోలు చేయించాలి. అప్పుడే రైతులు బాగుపడుతారు. లేదంటే అప్పులే మిగులుతాయి.

16మంది ఎస్ఐల బదిలీ

వరంగల్ క్రైం, మార్చి 12: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 16మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
సీహెచ్.ప్రమోద్‌కుమార్	మామునూరు	శాయంపేట
డి.దేవేందర్	శాయంపేట	కేయూసీ
బి.రవిందర్	వీఆర్	కేయూసీ
బి.వెంకన్న	వీఆర్	ఇంతెజార్‌గంజ్
వి.నవీన్‌కుమార్	వీఆర్	కాజీపేట
కె.శ్రావణ్‌కుమార్	వీఆర్	హనుమకొండ
ఎస్‌కె.మహమూద్	వీర్	మిల్స్‌కాలనీ
డి.విజయ్‌కుమార్	వీఆర్	నర్సంపేట
బి.ప్రవీణ్	వీఆర్	నర్సంపేట
టి.శ్రీకాంత్	వీఆర్	మామునూరు
సీహెచ్.పరుశరాములు	వీఆర్	హనుమకొండ
టి.లచ్చయ్య	వీఆర్	మట్టెవాడ
ఎస్.మౌనిక	వీఆర్	మహిళాపీఎస్ (సుబేదారి)
వి.ఉమాకాంత్	వీఆర్	కాజీపేట ట్రాఫిక్
ఇ.నర్సింహరావు	టాస్క్‌ఫోర్స్ వరంగల్	ఏనుమాముల
జె.మొగిళి	కాజీపేట ట్రాఫిక్	సీసీఎస్, వరంగల్

'వందేభారత్'కు ఘన స్వాగతం

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ



వందేభారత్ రైలుకు పచ్చజెండా ఊపుతున్న బీజేపీ నాయకులు

గిర్మాజిపేట, మార్చి 12 : వరంగల్ మీదుగా నడిచే కొత్తగా వచ్చిన సికింద రాబాద్-విశాఖపట్టణం వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు రైల్వేస్టేషన్‌లో బీజేపీ నాయకులు, రైల్వే అధికారులు మంగళవారం స్వాగతం పలికారు. మొదట ప్రధానమంత్రి నరేంద్రమోదీ అహ్మదాబాద్ నుంచి వర్చువల్‌గా ఈ రైలును ప్రారంభించారు. వందేభారత్ రైలును కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సికిందరాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం 10లో పచ్చజెండా ఊపి ప్రారంభించారు. సికిందరాబాద్‌లో బయలుదేరిన రైలు ఉదయం 11.58 గంటలకు వరంగల్ రైల్వేస్టేషన్ మొదటి ప్లాట్‌ఫాంపైకి చేరుకుంది. అప్పటికే పూలతో సిద్ధంగా ఉన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కుసుమ సతీష్, రైల్వే జడ్‌ఆర్‌యూసీసీ ఎరుకల రఘునారెడ్డి, వరంగల్ తూర్పు పార్టీ కన్వీనర్ పొట్టి శ్రీనివాస్‌లు తదితర ఇంజన్‌పై పూలు చల్లి స్వాగతం పలికారు. ఈమేరకు నాయకులు ప్రధానమంత్రి మోదీకి జిందాబాద్.. బీజేపీ జిందాబాద్.. దేశ్‌కి నేత మోదీజీ అంటూ నినాదాలు చేశారు. నిమిషం అనంతరం తిరిగి విశాఖపట్టణం బయలుదేరిన వందేభారత్‌కు నాయకులతో పాటుగా రైల్వేస్టేషన్ మేనేజర్ బి.బాలరాజు, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ బి.రాజ్‌గోపాల్ తదితర రైల్వే అధికారులు, సిబ్బంది పచ్చజెండా ఊపారు. అంతకుముందు ప్లాట్‌ఫాం 4లో అధికారులు ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రసారం చేశారు.

లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు
సన్నద్ధం కావాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తదితరులు

వరంగల్ కలెక్టరేట్, మార్చి 12: త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధం కావాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతీ జిల్లాలో ఎన్నికల ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. ఓటరు జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ ఏర్పాట్లు, ఈవీఎం యంత్రాలు, నామినేషన్ ప్రక్రియ, పోలింగ్ సిబ్బంది శిక్షణ తదితర అంశాలతో ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల కమిషన్ ప్రకటించిన వెంటనే ఎన్నికల ప్రవర్తన నియమావళిని జిల్లాలో అమలు చేయాలన్నారు. దానికి తగిన విధంగా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.ప్రావీణ్య, అదనపు కలెక్టర్లు అశ్విని తనాజీ వాకడే, సంధ్యారాణి, డీఆర్ఓ, ఆర్డీవో, నోడల్ అధికారులు, తహసీల్దార్, ఎన్నికల పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ఎన్‌పీడీసీఎల్ ఈఈలు (సివిల్) బదిలీ

హనుమకొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్లుగా తెలంగాణ రాష్ట్ర నార్తరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ ఎన్‌పీడీసీఎల్) కార్పొరేట్ కార్యాలయానికే పరిమితమైన సివిల్ ఎగ్జిగ్యూటివ్ ఇంజనీర్లు (ఈఈ)లకు ఎట్టకేలకు విముక్తి లభించింది. వారు తిరిగి క్షేత్రస్థాయికి వెళ్లి విధులు నిర్వహించే అవకాశం ఏర్పడింది. కార్పొరేట్ ఆఫీసులోని ఐదుగురు సివిల్ ఈఈలను సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కార్పొరేట్ ఆఫీసులో సీజీఎం పరిధిలో పనిచేస్తున్న ఈఈ (సివిల్) వెంకటేశ్వర్‌ను హనుమకొండ హెడ్‌క్వార్టర్‌లో ఎస్‌ఈ ఆపరేషన్‌కు మార్చారు. ఈయన హనుమకొండ, వరంగల్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ సర్కిళ్ల పరిధిలోని సివిల్ పనులను పర్యవేక్షిస్తారు.

ఇదే కార్పొరేట్ ఆఫీసులో సీజీఎం (ఆపరేషన్-1) పరిధిలో పనిచేస్తున్న మరో ఈఈ (సివిల్) కె.శ్రీనివాస్‌ను కరీంనగర్ హెడ్‌క్వార్టర్ ఎస్‌ఈ ఆపరేషన్ ఆఫీసుకు స్థాన చలనం చేశారు. ఈయన కరీంనగర్, జగిత్యాల, పెద్దపెల్లి ఆపరేషన్ సర్కిళ్ల పరిధిలోని విద్యుత్ సివిల్ పనులను చూస్తారు. కార్పొరేట్ ఆఫీసులో సీజీఎం (ఆపరేషన్-11) కింద పని చేస్తున్న ఈఈ (సివిల్) జి వెంకటేశ్వర్లును ఖమ్మం హెడ్ క్వార్టర్‌లోని ఎస్‌సీ (ఆపరేషన్) కార్యాలయానికి డైవర్ట్ చేశారు. ఈయన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం ఆపరేషన్ సర్కిళ్లను పర్యవేక్షిస్తారు. కార్పొరేట్ ఆఫీసులో సీఈ కన్‌స్ట్రక్షన్ ఆఫీసులో పని చేస్తున్న ఈఈ (సివిల్) కోమిరెడ్డి స్వామిని నిజామాబాద్ ఎస్‌ఈ (ఆపరేషన్) ఆఫీసుకు మార్చారు. ఆయన నిజామాబాద్ కామారెడ్డి సర్కిళ్లను, అలాగే కార్పొరేట్ ఆఫీసులో ఎస్‌ఈ/క్యూసీ అండ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో పని చేస్తున్న ఈఈ (సివిల్) పి.జానార్దన్‌రావును ఆదిలాబాద్ జిల్లా ఎస్‌ఈ ఆఫీసుకు బదిలీ చేశారు.

ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని ఆయా జిల్లాల్లో క్షేత్రస్థాయిలో సివిల్ పనులను పర్యవేక్షించాల్సిన వీరిని గత సీఎండీ గోపాల్‌రావు ఏడేళ్ల కిందట కార్పొరేట్ ఆఫీసుకు తీసుకువచ్చారు. దీనితో వీరికి పనిలేకుండా పోయింది. కొత్త సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన కర్నాటి వరుణ్ రెడ్డి ప్రక్షాళన చేపట్టారు. కార్పొరేట్ ఆఫీసులోని ఈఈ (సివిల్)లను ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని ఆయా జిల్లాల సర్కిళ్లకు పంపిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మండలాధ్యక్షులపై అవిశ్వాసాలు పెట్టొచ్చు

- నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీవోలకు ఉంది
- హైకోర్టు స్పష్టీకరణ .. పలువురి దావాల కొట్టివేత

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు వ్యతిరేకంగా వచ్చిన అవిశ్వాస తీర్మానాలపై సమావేశాలు నిర్వహించే అధికారం ఆర్డీవోలకు ఉందని హైకోర్టు తేల్చిచెప్పింది. పలు మండలాల అధ్యక్షులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. తమకు వ్యతిరేకంగా అవిశ్వాస సమావేశాలు నిర్వహించేలా ఆర్డీవోలు నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ.. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్ ఎంపీపీ ఉమాదేవి, రామన్నపేట్ ఎంపీపీ జ్యోతి, మద్నూర్ ఎంపీపీ లక్ష్మీబాయి, రామారెడ్డి ఎంపీపీ దశరథ్‌రెడ్డి, వరంగల్ జిల్లా గీసుకొండ ఎంపీపీ సౌజన్య, రంగారెడ్డి జిల్లా మర్రిగూడ ఎంపీపీ మోహన్‌రెడ్డి, సరూర్‌నగర్ ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డి, నల్లగొండ జిల్లా చండూర్ ఎంపీపీ పల్లె కల్యాణి, కరీంనగర్ జిల్లా రామడుగు ఎంపీపీ కలగంటి కవిత, ఆదిలాబాద్ జిల్లా ఏలూరు సారంగాపూర్ మండల ఉపాధ్యక్షుడు, జనగాం జిల్లా మల్యాల ఎంపీపీ విమల, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ ఎంపీపీ సువర్ణ, డిచ్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్, నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలానికి చెందిన సుజాత, ప్రభాకర్ తదితరులు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ఆర్డీవోల నుంచి తమకు అవిశ్వాస నోటీసులు అందాయని, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 263 ప్రకారం ఆ నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీవోకు లేదని పేర్కొన్నారు. ఈ నోటీసులను కొట్టివేయాలని కోరారు. విచారణ చేపట్టిన జస్టిస్ కే శరత్ ధర్మాసనం నోటీసులు జారీ చేసే అధికారం ఆర్డీవోలకు ఉందని తెలిపింది. సాంకేతిక కారణాలు చూపించి అవిశ్వాసాన్ని తప్పించుకోలేరని పేర్కొంది.

గుదిబండగా కరెంటు ఒప్పందాలు

ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తును వాడకున్నా.. రూ.వందల కోట్లలో బిల్లుల బకాయిలు.. న్యాయ విచారణకు సర్కారు నిర్ణయం

- జస్టిస్ నర్సింహారెడ్డితో కమిషన్
- యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్లపైనా విచారణ

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గుదిబండగా మారిన ఛత్తీస్‌గఢ్ కరెంటు ఒప్పందాల దుమ్మును దులపాలని రేవంత్‌రెడ్డి సర్కారు నిర్ణయించింది. ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటును కొనుగోలు చేయకున్నా.. ప్రస్తుతం ఒక్కయూనిట్ సరఫరా లేకున్నా.. వేల కోట్లలో బిల్లులు కట్టాల్సి రావడంపై న్యాయ విచారణకు ఆదేశించింది. ఇందుకోసం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డితో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అంతేకాదు.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్లపైనా ఈ కమిషన్ విచారణ జరుపుతుంది.



ఇదీ ఛత్తీస్‌గఢ్ కరెంటు కథ?

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక.. విద్యుత్తు అవసరాలను తీర్చాలనే ఉద్దేశంతో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం 2015 సెప్టెంబరు 22న ఛత్తీస్‌గఢ్‌లోని 1,000 మెగావాట్ల మార్వా ప్లాంట్ నుంచి 12 ఏళ్ల పాటు విద్యుత్తు కొనుగోలుకు ఒప్పందాలను కుదుర్చుకుంది. ఈ మేరకు పీపీఏ కింద తెలంగాణ డిస్కమ్‌లు, సీఎస్‌పీడీసీఎల్(ఛత్తీస్‌గఢ్) ఒప్పందాలపై సంతకాలు చేశాయి. అప్పట్లోనే విద్యుత్తు ఉద్యోగుల జేఏసీ అభ్యంతరాలు వ్యక్తం చేసినా.. ప్రభుత్వం కౌంటర్ సమర్థనలను చేయిస్తూ.. ముందుకెళ్లింది. ఇక ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటు సరఫరాకు వీలుగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్(పీజీసీఐఎల్)తోనూ ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్ కరెంటును కొనుగోలు చేయకపోవడంతో.. పెనాల్టీ కింద రూ.300 కోట్లను పీజీసీఐఎల్‌కు చెల్లించాలని కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి(సీఈఆర్‌సీ) ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు.. బకాయిల పేరుతో మార్వా ప్లాంట్ నుంచి విద్యుత్తు సరఫరా జరగకున్నా.. పాయింట్ ఆఫ్ కనెక్షన్ చార్జీలు(పీవోసీ) రూపంలో ఏటా రూ.400 కోట్ల నుంచి రూ.450 కోట్లను చెల్లించాల్సి వస్తోంది. స్థిర చార్జీల భారం కూడా తెలంగాణ డిస్కమ్‌లను వీడడం లేదు. 2020-21లో రూ.828.13 కోట్లు, 2021-22లో రూ.394.98 కోట్ల మేర స్థిరచార్జీలను చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం కాస్తా లేట్‌పేమెంట్‌తో కలుపుకొని రూ.3,576.89 కోట్లకు పెరిగినట్లు ఛత్తీస్‌గఢ్ చెబుతుండగా.. అది కేవలం రూ.2,100 కోట్లేనని తెలంగాణ డిస్కమ్‌లు వాదిస్తున్నాయి. కరెంటు బిల్లుల బకాయిలున్నాయంటూ రెండేళ్ల క్రితమే ఛత్తీస్‌గఢ్ కరెంటు సరఫరా నిలిచిపోయింది. నిజానికి తెలంగాణ డిస్కమ్‌లు 2021-22లో 1,631 మిలియన్ యూనిట్లు(కేవలం 19%) కొనుగోలు చేశాయి. 2022-23 ద్వితీయార్థంలో 2,713 మిలియన్ యూనిట్ల(31%) విద్యుత్తును కొనాలని అంచనాలు వేసినా.. ఆ పరిస్థితి లేదని తేలిపోయింది. 2023-24లో 78% విద్యుత్తు కొంటామనే అంచనాలున్నాయి. ఛత్తీస్‌గఢ్ డిస్కమ్‌లు బకాయిల పేరుతో ఆ మేరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేశాయి. రెండేళ్లుగా కరెంటు సరఫరా లేకున్నా.. 12 ఏళ్ల పాటు విద్యుత్తు కొనుగోలు ఒప్పందం బూచీగా ఇప్పుడు తెలంగాణ డిస్కమ్‌లపై భారం పడే ప్రమాదం ఉంది. ఒప్పందంలో ఇంకా ఆరేళ్లు మిగిలే ఉన్నాయి. పీపీఏ ఒప్పందం ప్రకారం విద్యుత్తును కొనకుంటే.. ఛత్తీస్‌గఢ్ డిస్కమ్‌లు ఆ కరెంటును ఓపెన్‌యాక్సెస్‌లో విక్రయించుకోవచ్చు. ఒకవేళ తెలంగాణ ఒప్పందం కంటే.. ఓపెన్‌యాక్సెస్ విక్రయం తక్కువ ధరలో ఉంటే.. ఆ భర్తీని తెలంగాణ డిస్కమ్‌లు పూడ్చాల్సి ఉంటుంది. ఇప్పుడు ఈ బకాయిలన్నీ తెలంగాణ డిస్కమ్‌ల పాలిట గుదిబండగా మారాయి. దీనిపై తెలంగాణ డిస్కమ్‌లు 2018లో విద్యుత్తు అప్పిలేట్ ట్రిబ్యునల్(అప్టెల్)ను ఆశ్రయించినా.. ఆ కేసు తేలే దాకా ఇబ్బందులు తప్పేలా లేవు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఈ తొందరపాటు ఒప్పందాలపై ఇప్పుడు రేవంత్ సర్కారు విచారణ జరిపించనుంది. మరోవైపు.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్లను వినియోగించుకోవాలా? వదిలేయాలా? అంటూ ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. భద్రాద్రిలో ఒక్కో ప్లాంట్ 270 మెగావాట్ల సామర్థ్యంతో.. మొత్తం నాలుగు ప్లాంట్లు 1,080 మెగావాట్లను ఉత్పత్తి చేస్తాయి. ఈ ప్లాంట్‌పై అప్పట్లోనే తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. సూపర్ క్రిటికల్ టెక్నాలజీ అందుబాటులో ఉన్నా.. సబ్-క్రిటికల్ టెక్నాలజీతో ప్లాంట్ కట్టడంపై నిపుణులు విమర్శలు చేశారు. 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో యాదాద్రి ప్లాంట్ ఇంకా నిర్మాణంలోనే ఉంది. ఇక్కడ కూడా భూసేకరణ, టౌన్‌షిప్‌ల నిర్మాణం, సబ్-కాంట్రాక్టుల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈ అంశాలపైనా జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ విచారణ జరపనుంది.

ఫలించిన 15 ఏళ్ల నిరీక్షణ

- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల డీఎస్సీ 2008 అభ్యర్థుల హర్షం
- కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరిగిందని ఆనందం

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2008లో అర్హత పొంది, నియామకాలు పొందని అభ్యర్థులకు కనీస వేతనాల పద్ధతిలో ఉద్యోగాలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తాము 15 ఏళ్లుగా పడుతున్న కష్టాల నుంచి ప్రభుత్వ ప్రకటనతో ఉపశమనం కలిగిందన్నారు. మంగళవారం సచివాలయంలోని మీడియా పాయింట్ వద్ద అభ్యర్థులు, అసోసియేషన్ ప్రతినిధులు సంబరాలు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... దశాబ్దంనర కాలంగా ఎదురుచూపులు నేడు ఫలించాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో తమకు న్యాయం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి, తమకు కాంట్రాక్ట్ పద్ధతిలో అయినా ఉద్యోగాలు ఇచ్చేందుకు ముందుకొచ్చినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తమకు సహకరించిన ప్రజాప్రతినిధులకు, విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంతో పాటు ఇతర అధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. త్వరగా విధివిధానాలు ప్రకటించాలని వారు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 'డీఎస్సీ 2008 అసోసియేషన్' అధ్యక్షుడు ఉమామహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మాకు ఉద్యోగాలు ఇవ్వండి

- డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ టీచర్ల మొర
- వేర్వేరు సమస్యలపై 'ప్రజావాణి'కి 1470 అర్జీలు



పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న బాలుడు గౌతమ్

సికింద్రాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తమకు తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలంటూ డీఎస్సీ 1998లో అర్హత సాధించిన ఉపాధ్యాయులు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నారు. 1998 డీఎస్సీలో నియామక ప్రక్రియ లోపభూయిష్టంగా జరిగిందని, ఎన్నికలు రావడంతో 1999లో డీఎస్సీ ప్యానల్‌ను రద్దు చేశారన్నారు. దాంతో డీఎస్సీ-98లో క్వాలిఫై అయిన అభ్యర్థులు ఉద్యోగావకాశాలు కోల్పోయారని తెలిపారు. ఈ మేరకు ప్రజాభవన్‌కు తరలివచ్చిన పలువురు అభ్యర్థులు ప్రజావాణిలో అర్జీ పెట్టుకున్నారు. ఇదే కాదు.. రేషన్ కార్డులు, పెన్షన్లు, ధరణి సమస్యలు, ఉద్యోగాలు, వైద్యంతోపాటు వేర్వేరు సమస్యలపై ప్రజావాణికి మంగళవారం 1,470 అర్జీలు వచ్చాయి. ఇందులో రెవెన్యూ పరమైన సమస్యలు 327, ఇంటి కోసం 251, పంచాయతీరాజ్ విభాగానికి 200, మైనార్టీ వెల్ఫేర్ సంబంధించి 145అర్జీలు ఉన్నాయి. ఆయా దరఖాస్తులను ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జీ.చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య, ఇతర అధికారులు ప్రజలను స్వీకరించారు. సంబంధిత విభాగాల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, పుట్టుకతో అంగవైకల్యంతో బాధపడుతున్న తనకు పెన్షన్ మంజూరు చేయాలని నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన దండు గౌతమ్ (13) దరఖాస్తు చేసుకున్నాడు. ఆరో తరగతి విద్యార్థి అయిన గౌతమ్ లేచి నిలబడాలన్నా, కూర్చోవాలన్నా ఇతరులపై ఆధారపడే స్థితిలో ఉన్నాడు. అలాగే, రైలు ప్రమాదంలో తగిలినగాయాల వల్ల తన కాలు, చెయ్యి పని చెయ్యడం లేదని, ఆర్థిక సమస్యల్లో ఉన్న కుటుంబాన్ని పోషించుకునేందుకు తనకు ఉద్యోగం ఇప్పించాలని నాంపల్లి నేతాజీనగర్‌కు చెందిన జి.శశికాంత్ దరఖాస్తు చేసుకున్నారు. ఉప్పల్‌కు చెందిన పలువురు వృద్ధ మహిళలు తమకు పెన్షన్ మంజూరు చేయాలని, అంబర్‌పేటకు చెందిన పలువురు మహిళలు రేషన్ కార్డు కోరుతూ అర్జీలు పెట్టారు. కాగా, తమ ఉద్యోగాన్ని క్రమబద్ధీకరించాలని, వేతనాన్ని రూ.19,500కు పెంచాలని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పార్ట్ టైమ్ స్వీపర్లు అర్జీ చేసుకున్నారు. గత ప్రభుత్వం తీరు వల్ల 1500 మంది అభ్యర్థులు ఉద్యోగాలు లేక అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం స్పం దించి తమకు న్యాయం చేయాలని రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన జూనియర్ లైన్‌మెన్లు అభ్యర్థించారు. బేగంపేట్‌లోని ఈశ్వరీయ విశ్వ విద్యాలయ కేంద్రంలో నిర్వహించే ఆధ్యాత్మిక తరగతులకు తమ ను రానివ్వడం లేదంటూ పలువురు మహిళలు ఫిర్యాదు చేశారు.



అంటువ్యాధుల నివారణ కోసం నిర్మించబోయే ప్రయోగశాల భూమిపూజలో పాల్గొన్న వివిధ రంగాల ప్రముఖులు

అంటువ్యాధుల నివారణకు ప్రయోగశాల

- 25 కోట్లతో ఐఐపీహెచ్ ఆవరణలో ఏర్పాటు
- హిమాయత్‌సాగర్‌లో భూమిపూజ
- భవిష్యత్‌లో పలు పరిశోధనలు

రాజేంద్రనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అంటువ్యాధుల నుంచి ప్రజలను కాపాడేందుకు హిమాయత్‌సాగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఐఐపీహెచ్) ఆవరణలో రూ.25 కోట్లతో ప్రయోగశాల(సైరస్ పూనావాలా సెంటర్ ఫర్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ అండ్ పాండమిక్ ప్రిపేర్డ్‌నెస్) నిర్మించనున్నట్లు ఐఐపీహెచ్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ మధుబాల రెంటల తెలిపారు. ఈ సెంటర్‌కు భూమిపూజను విల్లో పూనావాలా ఫౌండేషన్ సీఈవో జస్వీందర్ నారంగ్, ఇంటర్నేషనల్ పబ్లిక్ హెల్త్ సొసైటీ ఛైర్మన్ సి. శ్రీనివాస రాజు, ఐఐపీహెచ్ చీఫ్ మెంటార్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సంజయ్ జొడెపె, యూఎస్ఏకు చెందిన డాక్టర్ అనిల్ కౌల్‌తో కలిసి మంగళవారం నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ సెంటర్ అంటువ్యాధులను ఎదుర్కోవడానికి అంకితమైన మార్గదర్శక కేంద్రంగా పనిచేస్తుందన్నారు. దేశంలో, రాష్ట్రంలో అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలను సూచించడంలో ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్ వారు క్యాన్సర్ స్క్రీనింగ్ ఎక్స్‌ప్రెస్ పేరుతో సుమారు రూ.10 కోట్ల విలువ చేసే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే బస్సును ఐఐపీహెచ్‌కు బహూకరించారు. ఈ బస్సులో ఇక మీదట గ్రామాల్లో తిరుగుతూ మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

మూడు బోర్లు వేసి అప్పుల పాలై రైతు ఆత్మహత్య

- మెదక్ జిల్లాలో కిష్టాపూర్‌లో ఘటన
- విద్యుదాఘాతంతో మహిళా రైతు, ఎలక్ట్రీషియన్ మృతి

చేగుంట, అడ్డగూడూరు, కోదాడ రూరల్, మార్చి 12: చేతికొచ్చే సమయంలో పంట ఎండిపోకూడదని మూడు బోర్లు వేయించినా చుక్క నీరు రాకపోగా.. అప్పుల పాలవ్వడంతో కలత చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా చేగుంట మండల పరిధి కిష్టాపూర్‌కు చెందిన కుర్మ స్వామి(30) అనే రైతు తన పొలంలోని చెట్టుకు మంగళవారం ఉరి వేసుకుని మరణించాడు. కుర్మ స్వామి తనకున్న నాలుగు ఎకరాలలో వరిసాగు చేస్తున్నారు. పంటను కాపాడుకునేందుకు మూడు బోర్లు వేశారు. బోర్లు వేసేందుకు, పంట సాగుకు సుమారు నాలుగు లక్షల అప్పు చేశారు. నీళ్లు రాక పొలం ఎండిపోగా, అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుర్మ స్వామికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, పొలంలో కింద పడి ఉన్న 11కేవీ త్రీఫేజ్ మెయిన్ వైరును తొక్కి విద్యుదాఘాతానికి గురై యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం జానకీపురం గ్రామానికి చెందిన బోనాల లక్ష్మి(40) అనే మహిళా రైతు ప్రాణాలు కోల్పోయారు. లక్ష్మి రోజు మాదిరిగా మంగళవారం సాయంత్రం పొలంకు వెళ్తున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. ఇక, సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన షేక్ జానీమియా(35) అనే ఎలక్ట్రీషియన్ తన ఇంట్లో తెగిన విద్యుత్ తీగకు మర్మమతుల చేస్తూ విద్యుదాఘాతానికి గురై మరణించాడు.

రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో 4,356 అధ్యాపక పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకం
- నోటిఫికేషన్ జారీ.. 16న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు
- నాణ్యమైన విద్యే లక్ష్యం: మంత్రి దామోదర

పోస్టులు	ఖాళీల సంఖ్య	వేతనం (రూ.లలో)
ప్రొఫెసర్	498	1,90,000
అసోసియేట్ ప్రొఫెసర్	786	1,50,000
అసిస్టెంట్ ప్రొఫెసర్	1459	1,25,000
సీనియర్ రెసిడెంట్స్	1201	92,575
ట్యూటర్స్	412	55,000

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 26 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అధ్యాపకుల కొరత తీర్చేందుకు రేవంత్ రెడ్డి సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. 2021 అక్టోబరు నుంచి ఖాళీగా ఉన్న 4,356 టీచింగ్ పోస్టులను కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ప్రతిపాదికన భర్తీ చేయాలన్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ జీవో ఎంఎస్ నం.98 విడుదల చేసింది. ఇందులో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్, సీనియర్ రెసిడెంట్ పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీతో ఏటా సర్కారుపై అదనంగా రూ.634 కోట్ల భారం పడుతుందని మంత్రి తెలిపారు. మెడికల్ కాలేజీల్లోని అధ్యాపకుల నియామకాలన్నీ జిల్లా కలెక్టర్ల నేతృత్వంలోని డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీల ద్వారా సత్వరమే చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో వైద్య కళాశాలల బలోపేతం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. జాతీయ వైద్య కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన విద్య అందించడానికి పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. కాగా, కాలేజీల వారీగా పోస్టుల వివరాలను ఆయా కాలేజీల వెబ్‌సైట్లలో పొందుపర్చారు. కాలేజీల వెబ్‌సైట్ల వివరాలు డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లో (htpps://dme.telangana.gov.in) ఉన్నాయి. అన్ని కాలేజీల్లో ఈ నెల 16న వాక్-ఇన్-ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అర్హతలున్న అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

లోక్‌సభ ఎన్నికలకు ఖర్గే దూరం!

- ఒక నియోజకవర్గానికే పరిమితం కాదలుచుకోలేదు: ఏఐసీసీ చీఫ్
- దేశవ్యాప్తంగా దృష్టి పెడతానని వెల్లడి
- గుల్బర్గా నుంచి అల్లుడిని దింపే చాన్స్

న్యూఢిల్లీ, మార్చి 12: ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మల్లికార్జున ఖర్గే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. ఈ ఎన్నికలు అత్యంత కీలకమని, పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. తాను కూడా పోటీ చేస్తే ఒక నియోజకవర్గంపైనే దృష్టి పెట్టి, అక్కడే పరిమితం కావాల్సి ఉంటుందని ఖర్గే అభిప్రాయపడ్డారు. అయితే, పార్టీ వర్గాలు మాత్రం ఆయన పోటీ చేయాలని కోరుకుంటున్నాయి. ఈ ఎన్నికలను వదులుకోకూడదని, పోటీలో ఉండే పార్టీని ముందుండి నడిపించాలని వారు చెబుతున్నారు. కానీ, వీరి వాదనను ఖర్గే తోసిపుచ్చుతున్నారు. "రానున్న ఎన్నికలు అత్యంత కీలకం. పార్టీ చీఫ్‌గా ఒకే నియోజకవర్గానికి పరిమితం కాలేను. దేశవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలపైనా దృష్టిపెట్టాల్సి ఉంది" అని ఖర్గే తెలిపారు. కర్ణాటకలోని గుల్బర్గా నియోజకవర్గం నుంచి ఖర్గేని రంగంలోకి దింపాలని గత వారం జరిగిన సమావేశంలో నేతలు ఏకగ్రీవంగా భావించారు. ఈ నేపథ్యంలో ఆయన పేరును జాబితాలోనూ చేర్చారు. అయితే, ఖర్గే పోటీకి దూరంగా ఉండి, ఈసారి తన అల్లుడు రాధాకృష్ణన్ దొడ్డమానిని బరిలో నిలపాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. గుల్బర్గా నియోజకవర్గం నుంచి వరుసగా రెండుసార్లు విజయం సాధించిన ఖర్గే 2019 ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. అప్పటి నుంచి ఆయన రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పెద్దల సభలో విపక్ష నాయకుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. మరో నాలుగేళ్లు ఆయన పదవీ కాలం ఉంది. ప్రస్తుతం ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే సిద్దరామయ్య మంత్రి వర్గంలో కేబినెట్ మంత్రిగా ఉన్నారు. తొలుత ప్రియాంక్‌ను పార్లమెంటు బరిలో నిలపాలని అనుకున్నా.. తర్వాత ఈ నిర్ణయాన్ని పార్టీ వెనక్కి తీసుకుంది. ఇదిలావుంటే, ఖర్గే కనుక పోటీ చేయకపోతే, ఏఐసీసీ అధ్యక్షులుగా ఉండి ఎన్నికలకు దూరంగా ఉన్న వారిలో ఈయనే తొలి నాయకుడు అవుతారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి



నాగేష్(ఫైల్)

గీసుగొండ, మార్చి 12: ధర్మారం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సంగెం మండలం కృష్ణానగర్ (గొల్లపల్లి)కు చెందిన ఇమ్మడి నాగేష్(29) అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మంగళవారం జరిగింది. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం. కృష్ణానగర్‌కు చెందిన నాగేష్ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. హసన్‌పర్తి మండలం కేశవాపూర్‌లో జరుగుతున్న తన మరదలి వివా హానికి తల్లి పద్మను తీసుకొని ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ధర్మారం సమీపంలో వెనుక నుంచి వరంగల్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొంది. నాగేష్ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెం దాడు. తీవ్రంగా గాయపడిన పద్మకు ఎంజీఎంకు తరలించారు. నాగేష్‌కు భార్య ఇద్దరు కుమారులున్నారు. సీఐ పవన్‌కుమార్ పోస్టుమార్టం కోసం మార్చురీకి తరలించారు.



ఏసీపీకి వినతి పత్రం సమర్పిస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

'అవినీతిని ప్రశ్నిస్తే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులా'

సంతోష్ కేసుపై ఏసీపీకి విద్యార్థి సంఘాల ఫిర్యాదు

కరీమాబాద్, మార్చి 12: అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తున్న విద్యార్థి సంఘం నాయకుడు బాషబోయిన సంతోష్‌పై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడం సరైంది కాదని, కేసుపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ మంగళవారం హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డికి వామపక్ష విద్యార్థి సంఘాలు వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భీమారంలోని బీసీ బాలికల స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టల్‌లో జరుగుతున్న అవినీతి, అక్రమాలను వెలికితీయడానికి విద్యార్థి సంఘం నాయకులు ఆర్టీఐ ద్వారా సంబంధిత బీసీ సంక్షేమ శాఖను కోరటం జరిగిందన్నారు. అనంతరం హాస్టల్ అవినీతిపై హన్మకొండ జాయింట్ కలెక్టర్ వెంకట్ రెడ్డికి ఫిర్యాదు చేస్తే, బీసీ సంక్షేమ శాఖ విచారణ జరుపుతోందన్నారు. ఈక్రమంలో వార్డెన్ రేణుకుంట్ల ప్రియాంక తన అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చుకోడానికి ఏఐఎస్ఎఫ్ హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడం సమంజసం కాదన్నారు. ఎస్సీ, ఎస్టీ అణగారిన వర్గాల రక్షణ కోసం ఉపయోగించుకోవాల్సిన చట్టాలను కొంతమంది ప్రభుత్వ అధికారులు తాము చేస్తున్న అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చుకోడానికి ఉపయోగించుకోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నర్సింహారావు, ఏఐఎస్ఎఫ్ హన్మకొండ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్, యుఎస్ఎఫ్.ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ రాజేష్ నాయక్, నాయకులు వినయ్, రాజేష్, రాకేష్ పాల్గొన్నారు.

ఏసీపీని కలిసిన కార్పొరేటర్

సంగెం, మార్చి 12 : మామునూరు ఏసీపీగా ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా తిరుపతిని మంగళవారం 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణ విక్టర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏసీపీ తిరుపతికి పుష్పగుచ్ఛం అందజేసి హార్ధిక శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ ప్రాంతంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని ఏసీపీ కార్పొరేటర్ దంపతులను కోరారు.

పురుషోత్తమరావును కలిసిన నాయకులు

కరీమాబాద్, మార్చి 12: కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి వర్యులు తక్కెళ్లపల్లి పురుషోత్తమరావును 40వ డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు గజ్జల లింగమూర్తి, దాసి రాందేవ్‌లు కలిశారు. మంగళవారం హైదరా బాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. పురుషోత్తమరావు మాట్లాడుతూ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో బలంగా ఉందని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో బయోమెట్రిక్ ఉపసంహరించుకోవాలి

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ధర్నా



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

వరంగల్ కలెక్టరేట్, మార్చి 12: అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వరంగల్ కలెక్టరేట్ ముందు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రుక్మిణి, రాజేశ్వరి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ప్రవేశ పెట్టి అంగన్‌వాడీలను అవినీతిపరులుగా చిత్రీకరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులు పెట్టాలని ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. అంగన్‌వాడీల సమస్యలను పక్కనబెట్టి పేదల ప్రజల కోసం నిరంతరం సేవలు అందిస్తున్న మమ్ములను అవినీతిపరులుగా ఆరోపించడం అన్యాయమన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించనట్లయితే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ పి.ప్రావీణ్యకు సమర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు నిర్మల, రేణుక, లక్ష్మీ, అనిత, సత్యవతి, ఓదెమ్మ, పద్మ, మంజుల, రాధ, చంద్రమ్మ, ప్రేమకళ, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

చేతల్లో చూపిస్తాం..

5వ పేజీ తరువాయి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరగా.. రెండు మూడు రోజుల్లో భద్రకాళి గుడిని సందర్శించి, పరిశీలించిన తర్వాత నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటానని పొంగులేటి హామీ ఇచ్చారు.

రెండు నెలల్లో కాళోజీ కళాక్షేత్రం పనులు పూర్తికి ఆదేశం

హనుమకొండ హయగ్రీవాచారి గ్రౌండ్‌లో కాళోజీ కళాక్షేత్రం నిర్మాణంలో తీవ్ర జాప్యం జరగడంపై మంత్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ నిర్వాకంవల్ల పదేళ్ల నుంచి పనులు సాగుతూనే ఉన్నాయని, కళాక్షేత్రం అంచనా వ్యయం అడ్డగోలుగా పెంచుతూ పోవడాన్ని వారు తీవ్రంగా ఆక్షేపించారు. గత ప్రభుత్వం హయాంలో రూ.19కోట్లు మాత్రమే వచ్చాయని, అడ్డగోలుగా అంచనా వ్యయం పెంచుతూ పోతుండడంతో పనులు నత్తనడకగా సాగుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరపాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. ఎట్టిపరిస్థితుల్లో కాళోజీ కళాక్షేత్రం పూర్తిచేయాలని కుడా అధికారులను ఆదేశించారు. పెండింగ్ బిల్లులను చెల్లించేలా చూస్తానని నాయిని రాజేందర్‌రెడ్డి హామీ ఇస్తూ రెండునెలల్లో కళాక్షేత్రం పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

స్మార్ట్‌కు మార్జిన్ నిధులు

స్మార్ట్‌సిటీ నిధుల వినియోగంపై సమావేశంలో లోతుగా సమీక్ష జరిగింది. స్మార్ట్ నిధులతో చేపట్టిన చాలా పనులు నత్తనడకగా, ముఖ్యంగా నాసిరకంగా జరుగుతుండడం పట్ల మంత్రులు, ఎమ్మెల్యే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో నిధులు ఖర్చు చేయకపోతే నిధులు వృథాఅయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తన వంతుగా ఇవ్వాల్సిన నిధులను విడుదల చేయకపోవడంవల్ల రావలసిన మిగతా స్మార్ట్ నిధులు ఆగిపోయాయని ఎమ్మెల్యే నాయిని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం తనవాటాగా రూ.60కోట్ల మార్జిన్ నిధులను విడుదల చేస్తే రూ.107కోట్ల వరకు వస్తాయని తెలిపారు. ఇందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువచ్చి రూ.60కోట్లు విడుదలయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి : ఎస్ఐ

సంగెం, మార్చి 12:పాఠశాలల్లో చదివే విద్యార్థులు స్మార్ట్ సెల్ ఫోన్లు వినియోగించవద్దని సంగెం ఎస్ఐ నరేష్ చెప్పారు. సంగెం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పౌచ్‌లు, స్కేళ్లు, ఏలైజర్లు, రబ్బర్లు ఉచితంగా ఉంద జేశారు. సామాజికవేత్త, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, దాత అల్లం బాలకిశోర్‌రెడ్డి ఉచితంగా అందజేసిన వస్తువులను ఎస్ఐ అందజేశారు. ఎస్ఐ మాట్లాడుతూ సెల్ ఫోన్లతో విద్యార్థులకు నష్టం ఎక్కువ ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి నీలిమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ ఎన్నిక

కరీమాబాద్, మార్చి 12: వరంగల్ జిల్లా 13 మండలాల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుని కమిటీ సభ్యులకు బాధ్యతలు అప్పగించారు. మంగళవారం పుప్పాలగుట్టలోని జీసస్ హోలీ ఫైర్ మినిస్ట్రీస్ మందిరంలో కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ చైర్మన్‌గా డాక్టర్ ఎన్.సాల్మన్ రాజ్, ప్రెసిడెంట్‌గా మంతెన గాబ్రియేల్ పాల్, సెక్రటరీగా కే.ఆనంద్ రాజ్, ట్రెజరరీగా ఎం.డేవిడ్‌రాజ్, వైస్ ప్రెసెడెంట్లుగా డి.కిరణ్ అబ్రహం, ఎస్.దయాకర్, జాయింట్ సెక్రటరీగా ఎజ్రా శాస్త్రీ, ఎలీషారాజు, అబ్రహం, అడ్వైజర్‌గా ఏలియా, జాయింట్ ట్రెజరర్‌గా కె.రాజు ఎన్నికయ్యారు.

హైదరాబాద్ సభకు తరలిన బీజేపీ నేతలు



సభకు బయలుదేరుతున్న డివిజన్ అధ్యక్షులు

కరీమాబాద్, మార్చి 12: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన బీజేపీ విజయసంకల్ప సమ్మేళన సభకు నగరంలోని పలు డివిజన్ల అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు తరలివెళ్లారు. నగరంలోని 40, 41, 42వ డివిజన్ల ఇన్‌చార్జి కర్నె రవీందర్ ఆధ్వర్యంలో డివిజన్లకు చందిన బీజేపీ అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు రంగశాయిపేట మహంకాళీ దేవాలయం నుంచి బస్సులో బయలుదేరారు. సభకు తరలిన వారిలో సీనియర్ నాయకులు బైరి నాగరాజు, మాచర్ల దీన్‌దయాల్, చిన్నారావు, మోహనాచారి, డివిజన్ అధ్యక్షులు కర్నె వాసుదేవ్, తాళ్లపెల్లి అర్జున్, ఆకుతోట రాజు, సాంబరాజు, సుదర్శన్ ఉన్నారు.

సంతాపసభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖిలావరంగల్, మార్చి 12: ఐఎఫ్‌టీయూ జాతీయ నాయకుడు కూరపాటి లింగమూర్తి (రామారావు) సంతాప సభను ఈనెల 17న కాశిబుగ్గ జంక్షన్ వద్ద నున్న లక్ష్మీపురం కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించనున్నట్లు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ తెలిపారు. మంగళవారం మధ్యకోటలో సంతాపసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగమూర్తి విప్లవ కార్మిక ఉద్యమ నిర్మాణానికి కృషి చేశారన్నారు. ఆజాంజాహి మిల్లు కార్మికుల కోసం ప్రింటింగ్, బైడింగ్ కార్మికుల వేతనాల కొరకు యూనియన్ స్థాపించి పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జిల్లా నాయకుడు బండి కోటేశ్వర్‌రావు, ఏఐకేఎంఎస్ నాయకుడు రాచర్ల బాలరాజు, ఐఎఫ్‌టీయూ నగర ప్రధాన కార్యదర్శి జన్నారం రాజేందర్ పాల్గొన్నారు.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిని కలిసిన బీజేపీ ప్రతినిధులు

సంగెం, మార్చి 12 : జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా ఇటీవల నియామకమైన జాటోతుహుసేన్ నాయక్‌ను మంగళవారం బీజేపీ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని నాయక్ నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి వాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి, రాష్ట్ర గిరిజన మోర్చా కార్యవర్గ సభ్యుడు వినోద్, గ్రేటర్ వరంగల్ 43వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మల్లాడి రాంరెడ్డి, పర్వతగిరి మండలపార్టీ అధ్యక్షుడు శ్రీనివాస నాయక్ పాల్గొన్నారు.

సీకేఎంలో పూర్వవిద్యార్థుల నిరసన



చందా కాంతయ్య విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పోచమ్మమైదాన్, మార్చి 12: దేశాయిపేట సీకేఎం కళాశాలలోనికి పూర్వ విద్యార్థులను రాకుండా ప్రిన్సిపాల్ అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ మంగళవారం పలువురు పూర్వవిద్యార్థులు ప్రిన్సిపాల్ చాంబర్‌లో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి లంక రాజగోపాల్ మాట్లాడుతూ కళాశాలను అభివృద్ధి చేసేందుకు తమవంతు బాధ్యతగా కళాశాలకు వచ్చిన తమను లోనికి రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కళాశాల ప్రభుత్వపరం చేసిన క్రమంలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసే సిబ్బందిని ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా, పరీక్షలు నిర్వహించకుండా ప్రభుత్వ ఉద్యోగులుగా ఎలా ఆమోదిస్తారని ప్రశ్నించారు. రెగ్యులరైజేషన్ అంశంతోపాటు ఉద్యోగుల వివరాలను సమాచార హక్కుచట్టం కింద కోరితే ప్రిన్సిపాల్ వివరాలు లేవని సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. సిబ్బంది రెగ్యులరైజ్ వెనుక రూ.రెండు కోట్లు చేతులు మారినట్లు ఆరోపించారు. కళాశాల ఆవరణలో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసుకునేందుకు సైతం అనుమతి నిరాకరిస్తున్నారన్నారు. అనంతరం కళాశాల చందా కాంతయ్య విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శివ, చరణ్, వినోద్, సంపత్ పాల్గొన్నారు.

శివనగర్ స్కూల్‌లో మాక్ పోలింగ్

ఖిలావరంగల్, మార్చి 12: ఎన్నికల ప్రక్రియ ప్రజాస్వామ్యానికి ప్రాణం లాంటిదని శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొమ్మోజు శ్రీధర్ అన్నారు. మంగళవారం పాఠశాలలో మాక్ పోలింగ్‌ను నిర్వహించారు. రెండు బూత్‌లను ఏర్పాటు చేసి 8,9,10 తరగతుల విద్యార్థులు బ్యాలెట్ పేపర్లపై ఉన్న గుర్తులపై ఓట్లను వేశారు. అనంతరం కౌంటింగ్‌ను చేపట్టి, గెలిచిన అభ్యర్థికి సన్మానం చేశారు. ఉపాధ్యాయులు ఎ.భిక్షపతి, కె.చంద్రకళ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌లుగా వ్యవవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్ శ్రీనివాస్, నరేంద్రస్వామి, తిరుపతి, లక్ష్మీనారాయణ, శేషాచారి, అంజయ్య, సందీప్, కిరణ్మయి, విద్యార్థులు పాల్గొన్నారు.



ఓట్లను కౌంటింగ్ చేస్తున్న విద్యార్థులు

16న భక్త మార్కండేయ గణపతి దేవాలయ ప్రతిష్ఠాపన

అధ్యక్షుడు వొడ్నాల మల్లయ్య

ఖిలావరంగల్, మార్చి 12: ఈనెల 16న శివభక్త మార్కండేయ గణపతి దేవాలయ ప్రతిష్ఠాపన వేడుకలను నిర్వహించనున్నామని దేవాలయం అధ్యక్షుడు వొడ్నాల మలయ్య తెలిపా రు. మంగళవారం శివనగర్‌లోని ఆలయ ఆవరణలో విలేకరుల సమావేశంలో మా ట్లాడుతూ 16న శ్రీశివభక్త మార్కండేయ గణపతి సుబ్రమణ్యస్వామి అభయాంజనే య నవగ్రహ విగ్రహసహిత ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ఠాపణ మహోత్సవం జరుగు తుందన్నారు. మంత్రి కొండా సురేఖ ప్రారంభించే ఈ కార్యక్రమంలో నగర మేయ ర్ గుండు సుధారాణి, మండలి వైస్ ప్రెసిడెంట్ బండా ప్రకాశ్, మాజీమంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, మాజీ మంత్రి నన్నపునేని నరేందర్, 34వ, డివిజన్ కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, తదితరులు హాజరవుతున్నారన్నారు. 3 వేల మంది సభ్యులు కలిగిన పద్మశాలీ పరస్పర సహకార పరపతి సంఘం క్షేమ నిధి నుంచి దేవాలయ నిర్మించడం జరిగిందన్నారు. 14న గణపతి పూజ, పుణ్యాహవ చనం, 15న మండపపూజ, మూలమంత్ర హవనం, 16న, యంత్రప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ వొడ్నాల సదానందం, కమిటీ సభ్యులు మాచర్ల వెంకటేశ్వర్లు, బుదారపు భాస్కర్, ఊరుగొం డ సారంగపాణి, రాంపల్లి చంద్రమౌళి, పాశికంటి రాజేంద్రప్రసాద్, పాశికంటి రాజేశ్వ ర్‌రావు, పాశికంటి రవి, తౌటం మధు, పిట్ట భాస్కర్ పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న దేవాలయం అధ్యక్షుడు మల్లయ్య

'డీఎస్సీ 2008 అభ్యర్థులకు న్యాయం చేశారు..'

గీసుగొండ, మార్చి 12: సుప్రీంకోర్టు తీర్పు మేరకు డీఎస్సీ-2008 అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించేలా తెలంగాణ కేబినెట్ తీర్మానించటంపై డీఎస్సీ 2008 బాధితుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రడం భరత్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం గీసుగొండలో మాట్లాడుతూ దశాబ్దం కాలానికి పైగా పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం డీఎస్సీ 2008 అభ్యర్థులకు మినిమం టైం స్కేల్ ఇస్తూ ఉపాధ్యాయులుగా నియమిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించటం ఆనదంగా ఉందన్నారు. కేబినెట్ నిర్ణయంతో దాదాపు 900 కుటుంబాలకు న్యాయం జరుగుతుందన్నారు. సమస్య పరిష్కారం కోసం కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

తపాలా శాఖ ఉద్యోగుల జాతీయ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



వరంగల్‌కల్చరల్, మార్చి 12: వరంగల్ జిల్లాకు చెందిన బొడ్డున వెంకటేశ్వర్లు అఖిల భారత తపాల ఉద్యోగుల జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. బొడ్డున వెంకటేశ్వర్లు జాతీయ అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో రాష్ట్ర పద్మశాలీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు శుభాకాంక్షలు తెలిపారు. పద్మశాలీ సామాజిక వర్గంకు చెందిన వెంకటేశ్వర్లు జాతీయ అధ్యక్షుడిగా కావడంతో ఉద్యోగులు అభినందనలు తెలిపారు.



విద్యార్థులే ఉపాధ్యాయులై..

కరీమాబాద్, మార్చి 12: శంభునిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయంపరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రధానోపాధ్యాయుడు సోల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ పాఠాలు బోధించడం, మిగితా విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టడం, బాధ్యతాయుత భావనలో నిమగ్నమవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది వెంకటేశ్వర్లు, ప్రవీణ్, సునిల్, రాజు, పవిత్ర, మమత, ఉమారాణి, సరిత, షాహేద పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

17న రాష్ట్రస్థాయి భగవద్గీత శ్లోక పఠన పోటీలు

పోచమ్మమైదాన్, మార్చి 12: గ్రేటర్ వరంగల్ నగరంలోని గురుధామంలో 17న రాష్ట్ర స్థాయి భగవద్గీత శ్లోకపఠనం పోటీలు నిర్వహించనున్నట్లు శివానందగురు కల్చరల్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్ తెలిపారు. పైడిపెల్లిలోని గురుధామంలో మంగళవారం ట్రస్టు ఆధ్వర్యంలో పోటీల వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీలలో గెలుపొందిన వారికి నగదు పురస్కారం అందించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి కల్గిన వారు 9848423133 నెంబరు వాట్సాప్ ద్వారా తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు బండారు సాయినారాయణ, సోమ రామయ్య, తాటికొండ చక్రపాణి, గందె ఉమాశంకర్, నాయక్‌అహ్మద్, వెంకటరమణ పాల్గొన్నారు.



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

ఆలయ హుండీ లెక్కింపు

ఖిలావరంగల్, మార్చి 12: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మధ్యకోటలోని స్వయంభూశంభులింగేశ్వర స్వామి దేవాలయం హుండీ ఆదాయం రూ.1,26,025 దేవాలయ ఈవో వెంకట్రావ్ తెలిపారు. మంగళవారం మధ్యకోటలో మహా శివరాత్రి రోజున భక్తులు వెసిన కానుకలను దేవాదాయశాఖ అధికారుల ఆదేశాల మేరకు లెక్కింపులు చేశారన్నారు. గత సంవత్సరం హుండీ రూ.1.20లక్షలు రాగా, ప్రస్తుతం రూ.1,26,025 వచ్చాయన్నారు. కానుకలను ఆలయ అభివృద్ధి కోసం బ్యాంక్‌లో జమ చేశారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ- సురేష్, దేవాలయ ఇన్‌స్పెక్టర్ వీరన్న, అర్చకుడు శంభులింగం పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు డివిజన్ యూత్ అధ్యక్షుడి రాజీనామా



భరత్

సంగెం, మార్చి 12 : బీఆర్ఎస్ పార్టీకి 43వ డివిజన్ ఆ పార్టీ అధ్యక్షుడు మంగళవారం పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. మలిదశ ఉద్యమకాలం నుంచి పార్టీలో పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఇటీవల పార్టీలో జరిగే రాజకీయ పరిణామాలు నచ్చక పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.



ప్రభుత్వ పాఠశాలలో మాక్ పోలింగ్

నర్సంపేట, మార్చి 12 : నర్సంపేటలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, పోలింగ్, ఓటింగ్ విధానం, కౌంటింగ్‌పై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఆరుగురు అభ్యర్థులు ఎన్నికలో నిలబడగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిసీడింగ్ ఆఫీసర్‌గా ప్రజ్వల, అసిస్టెంట్ ప్రిసీడింగ్ ఆఫీసర్‌గా టైసీన్, ఓపీవోలుగా స్రవంతి, శ్రీవిజ్ఞ, స్పందన, సాల్మాన్, పోలింగ్ ఏజెంట్లుగా గౌరిక, మనోజ్, మణికంఠ వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. సారయ్య, ఉపాధ్యాయులుశ్రీనివాస్, రమేశ్, డి.రమేశ్, ఎం.రమేశ్, ఉమామహేశ్వర్, రవికుమార్, బుచ్చిరాములు, భిక్షపతి, గోపాల్‌రావు, బాల, శైలజ, శ్రీలత పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఐల్యాండ్ నిర్మాణ పనులు ప్రారంభం

'ఆంధ్రజ్యోతి' కథనంతో స్పందించిన అధికారులు



వరంగల్ క్రాస్‌రోడ్డులో కొనసాగుతున్న నిర్మాణ పనులు

నర్సంపేట టౌన్, మార్చి 12 : నర్సంపేట పట్టణంలో ప్రధాన కూడళ్లల్లో ట్రాఫిక్ ఐల్యాండ్ (జంక్షన్)ల నిర్మాణ పనులు అస్తవ్యస్థంగా తయారయ్యాయని, మునిసిపల్ అధికారులు, పాలకవర్గ నిర్లక్ష్యం వల్ల అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని ఈ నెల 10న ఆంధ్రజ్యోతి జిల్లా టాబ్లాయిడ్‌లో ప్రచురించిన కథనానికి మునిసిపల్ అధికారులు స్పందించారు. మంగళవారం యుద్ధప్రాతిపదికన మునిసిపల్ అధికారులు ఐల్యాండ్ మధ్యలో కాకతీయ తోరణంను ఏర్పాటు చేసి అసంపూర్తిగా ఉన్న పనులను పునః ప్రారంభించారు. దీంతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురించడం వల్లనే పనులు పునః ప్రారంభమయ్యాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీలు



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

రాయపర్తి, మార్చి 12: బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు మంగళవారం రాజీనామా చేసి కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కొండూరు ఎంపీటీసీ చిర్ర ఉపేంద్ర, కేశవపురం ఎంపీటీసీ బానోత్ శ్వేతాసుభాష్, మహబూబ్‌నగర్ ఎంపీటీసీ చిక్కోడు రంజితవీరస్వామి, మైలారం ఎంపీటీసీ గాడిపెల్లి వెంకన్న, సన్నూరు ఎంపీటీసీ భూక్య గోవిందనాయక్, మహబూబ్‌నగర్ గ్రామ మాజీ అధ్యక్షుడు ఎర్ర యాకూబ్‌రెడ్డి, చిక్కొండ అశోక్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలో పాత, కొత్త తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా ముందుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యానాయక్, మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, కృష్ణమాచార్యులు, పెండ్లి మహేందర్‌రెడ్డి, సరికొండ కృష్ణారెడ్డి, ముద్రబోయిన వెంకన్న, గోవర్ధన్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు

నల్లబెల్లి, మార్చి 12: నారక్కపేట ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యాక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రావు మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలకు దీటుగా, ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యతతో కూడిన విద్యా, కంప్యూటర్, డిజిటల్ ప్రత్యేక తరగతులను విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. వీడ్కోలు సమావేశంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, అశోక్, రాజు, జ్యోతి, హేమలత, ఆశ, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అందుబాటులోకి రైల్వే సేవలు

నెక్కొండ-చింతలపల్లి మధ్య మూడో రైల్వేలైన్ ప్రారంభం

జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ



నెక్కొండ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌లో మాట్లాడుతున్న మోదీ

నెక్కొండ, మార్చి 12 : దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు రైల్వే సేవలను అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా రైల్వే శాఖ అభివృద్ధికి లక్షల కోట్ల రూపాయలను వెచ్చిస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. నెక్కొండ-చింతలపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య నూతనంగా నిర్మించిన మూడో రైల్వే లైన్, ఒకే స్టేషన్ - ఒకే ఉత్పత్తి స్టాల్‌ను రిమోట్‌కంట్రోల్‌తో ప్రధానమంత్రి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నెక్కొండ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రధాని ప్రసంగాన్ని ప్రజలు వీక్షించారు. రూ.85వేల కోట్లకు పైగా విలువైన రైల్వే ప్రాజెక్టులను వర్చువల్‌గా శంకుస్థాపన, జాతికి అంకితం పలు రైల్వే సేవలకు జెండా ఊపి ప్రారంభించినట్లు ప్రధాని తెలిపారు. అటవీ ఉత్పత్తులను తక్కువ ధరలకు ప్రయాణికులకు అందించాలనే ఉద్దేశంతో ఒకే స్టేషన్ ఒకే ఉత్పత్తి స్టాల్స్ ప్రారంభించినట్లు ప్రకటించారు. భవిష్యత్‌లో రైల్వే శాఖ ద్వారా అత్యంత అధునిక సేవలను అందించగలమన్నారు. రైల్వే శాఖకు ఆదాయం సమకూర్చే గూడ్స్ రైళ్ల వేగం పెంచడం జరిగిందన్నారు.

నెక్కొండ రైల్వే టికెట్ల ఫోరం కమిటీ కన్వీనర్ గోరంట్ల వెంకట్‌నారాయణ ఆధ్వర్యంలో నెక్కొండ స్టేషన్‌లో సౌకర్యాలను మెరుగుపర్చడంతోపాటు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇపించాలని కోరుతూ రైల్వే అధికారులకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నెక్కొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్, బీజేపీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు హరిప్రసాద్, ఫోరం కన్వీనర్ వెంకటనారాయణ, ఏడీఈఎన్ రమేశ్‌బాబు, కమర్షియల్ సూపర్‌వైజర్ భిక్షపతి, స్టేషన్ సూపరిండెంట్ ఉమేశ్‌కుమార్‌పాండే, పావని పాల్గొన్నారు.

పైపులను పరిశీలించిన అధికారులు

చెన్నారావుపేట, మార్చి 12: మండలంలోని కోనాపురంలో పగిలిన పైప్‌లైన్లను మిషన్ భగీరథ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఇటీవల గ్రామంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ప్రధాన సెంటర్‌లో జేసీబీ యంత్రంలో రోడ్డును తవ్వుతుండగా మిషన్ భగీరథ పైపులైన్‌లు ధ్వంసమయ్యాయి. దీంతో గ్రామంలో తాగు నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతుండగా సమాచారం అందుకున్న ఈఈ వెంకటరమణరెడ్డి, డీఈ మంగీలాల్‌లు పైపులైన్లను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తాగునీటిపై ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాజ్‌కుమార్, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వర్ధన్నపేట రూరల్, మార్చి 12: ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని వర్ధన్నపేట తహసీల్దార్ విజయ్ సాగర్ అన్నారు. మంగళవారం మండలంలోని కట్ర్యాలలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయ్ సాగర్ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకు వస్తే దశలవారీగా పరిష్కారం చూపుతామన్నారు.

ఉద్యమకారులకు ఇంటి స్థలం ఇవ్వాలి

తహసీల్దార్‌కు వినతి

దుగ్గొండి, మార్చి 12: తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలంతో పాటు ఇందిరమ్మ గృహపథకం కింద రూ.5లక్షలు మంజూరు చేయాలని మంగళవారం ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ రవిచంద్రారెడ్డికి వినతి పత్రం అందించారు. ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమ కారులకు స్థలంతో పాటు ఇంటి నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం అమలు చేయాలని, ఉద్యమంలో పని చేయడం జరిగిందని ఉద్యమంలో అరెస్టులు, కేసులు నమోదు కావడం జరిగిందని, వినతి పత్రంలో తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో బొనగాని రవీందర్, బండెల సదానందం, కూస సుమన్, బైగాని శ్రీనివాస్, సాంబరాజు రాములు, తొగరు ప్రవీన్‌లు తదితరలు ఉన్నారు.

అమిత్‌షా సభకు తరలిన బీజేపీ శ్రేణులు



వర్ధన్నపేటలో జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న పట్టణ అధ్యక్షుడు చీటూరి రాజు

నర్సంపేట, మార్చి 12 : హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో మంగళవారం బీజేపీ రాష్ట్రకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయ సంకల్ప సమ్మేళననానికి బీజేపీ నియోజకవర్గ చేరికల కమిటీ చైర్మెన్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. నర్సంపేట పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తల వాహనాలలో ఈ సమ్మేళనానికి తరలివెళ్లారు. హైదరాబాద్ వెళ్లిన వారిలో మహబూబాబాద్ పార్లమెంట్ కోకన్వీనర్ రామచంద్రరెడ్డి, పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు, ఆబోతు రాజు యాదవ్, బొద్దిరెడ్డి ప్రతాప్ రెడ్డి, రాజేందర్, గంగిడి మహేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు జుర్రు రాజు, లూనావత్ కవిత వీరన్న, బోడ గోల్యానాయక్‌తో పాటు బాల్నెజగన్, నర్సింహరాములు, పృద్వీరాజ్, మల్లయ్య ఉన్నారు.

● వర్ధన్నపేట : బీజేపీ నేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభకు వర్ధన్నపేట నుంచి బీజేపీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద జెండా ఊపి బస్సును పట్టణ అధ్యక్షుడు చీటూరి రాజు ప్రారంభించారు. కా ర్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి పెద్దూరి రాజు, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అయిత రవికుమార్, జిల్లా నాయకులు మాజీ ఉపసర్పంచ్ కొండేటి సత్యం, వర్ధన్నపేట సోషల్ మీడి యా ఇన్‌చార్జి విక్రమ్, రాజు, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

● నెక్కొండ: నెక్కొండ నుంచి బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు సొంటిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. జేపీ నాయకులు అంజనేయులు, సింగారపు సురేష్, కాసు ల రత్నయ్య, శ్రీరంగం శ్రీనివాస్, అనిల్ కుమార్, రాపా క సందీప్, సింగారపు సురేష్, శ్రీనివాస్ తరలివెళ్లారు.

● నల్లబెల్లి: విజయ సంకల్ప సమ్మేళనానికి మండల బీజేపీ నాయకులు మంగళవారం వెళ్లారు. ఈ సమ్మేళనానికి తరలి వెళ్లిన వారిలో బొద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, తడుక అశోక్, ఒల్లే రమేష్, ఈర్ల నాగరాజు, కామోర పాపయ్య, తడుక వినయ్, ప్రమోద్, కృష్ణమూర్తి, నవీన్, రాజు, యాదగిరి ఉన్నారు.

మహిళా సదస్సుకు తరలిన మహిళలు



రాయపర్తిలో జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న ఎంపీడీవో

వర్ధన్నపేట, మార్చి 12: సికింద్రాబాద్‌లో నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ భారీ బహిరంగ సభకు మంగళవారం వర్ధన్నపేట మండలంలోని వివిధ గ్రామాల నుంచి డీఆర్‌డీఏ, సెర్ప్ సహకారంతో గ్రామైక్య సంఘాల మహిళలు ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్లారు. మహిళలకు రవాణాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు ఇన్‌చార్జిలు తెలిపారు. సికింద్రాబాద్ సదస్సుకు తరలివెళ్లిన వారిలో ఏపీఎం వేణు, సీసీలు గోలి కొమురయ్య, రమేశ్, కొమురయ్య, ఈవోఏలు తక్కళ్లపల్లి శోభ, పద్మజ్యోతి, కవిత, బిర్రు దయాకర్, అనిత, మంజుల, స్రవంతి, రమ్య, సుజాత, శిరీష, పీఆర్‌పీలు మహబూబాబా, కవిత, వీవో ప్రతినిధులు భాను, పల్లవి, బొమ్మెర పుష్పమ్మ, చెంగల శ్రీలత తదితరులు ఉన్నారు.

● చెన్నారావుపేట: మహిళా సదస్సుకు మండంలోని పలు గ్రామాలకు చెందిన మహిళలు, మహిళా సంఘాల ప్రతినిధులు తరలి వెళ్లారు. ఉదయం ఎంపీడీవో గోవిందరాజు జెండా ఊపి బస్సును ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం ఈశ్వరయ్య, మండల సమైక్య అధ్యక్షురాలు కద్దురి హైమా, లక్ష్మీ, గోపు మమత, మర్రి మంజుల, శ్రీలత, సుజాత, అమని, కళ్యాణి, అరుణ పాల్గొన్నారు.

● రాయపర్తి: హైదరాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్స్‌లో జరిగిన రాష్ట్ర మహిళాసదస్సుకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి మహిళా సంఘాల సభ్యులు తరలివెళ్లారు. ఈసందర్భంగా ఎంపీడీవో కిషన్ నాయక్, ఏపీఎం కిరణ్‌కుమార్ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. సదస్సుకు తరలివెళ్లినవారిలో వీవోలు రమాదేవి, మంగమ్మ, కరుణశ్రీ తదితరులు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య



అజయ్ (ఫైల్)

నెక్కొండ, మార్చి 12 : ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వెంకటాపురంలో చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బర్రె మల్లయ్య, మంజుల దంప తుల కుమారుడు అజయ్ (26)ప్రయివేటు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగి స్తున్నాడు. పనులు దొరకని సమయంలో కుటుంబ అవసరాల నిమిత్తం అప్పులు చేశాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో సోమవారం రాత్రి గొర్రె ల చికిత్స కోసం తెచ్చిన మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమి త్తం ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దేవాలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

నెక్కొండ, మార్చి 12 : దేవాలయాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారిస్తుందని నర్సంపేట టీపీసీసీ మెంబర్ సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం జరిగిన నెక్కొండలోని గంగమ్మ గుడి ప్రహరీ గోడ నిర్మాణం పనుల ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ యాదవుల కులదైవం గంగమ్మ గుడి ప్రహరీ గోడ నిర్మాణానికి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సీడీఎఫ్ ప్రత్యేక నిధుల నుంచి రూ. ఐదు లక్షలు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్, హరిప్రసాద్, యాదవకులస్థులు పాల్గొన్నారు.

చేతల్లో చూపిస్తాం..

5వ పేజీ తరువాయి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరగా.. రెండు మూడు రోజుల్లో భద్రకాళిగుడిని సందర్శించి, పరిశీలించిన తర్వాత నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటానని పొంగులేటి హామీ ఇచ్చారు.

రెండు నెలల్లో కాళోజీ కళాక్షేత్రం పనులు పూర్తికి ఆదేశం

హనుమకొండ హయగ్రీవాచారి గ్రౌండ్‌లో కాళోజీ కళాక్షేత్రం నిర్మాణంలో తీవ్ర జాప్యం జరగడంపై మంత్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ నిర్వాకంవల్ల పదేళ్ల నుంచి పనులు సాగుతూనే ఉన్నాయని, కళాక్షేత్రం అంచనా వ్యయం అడ్డగోలుగా పెంచుతూ పోవడాన్ని వారు తీవ్రంగా ఆక్షేపించారు. గత ప్రభుత్వం హయాంలో రూ.19కోట్లు మాత్రమే వచ్చాయని, అడ్డగోలుగా అంచనా వ్యయం పెంచుతూ పోతుండడంతో పనులు నత్తనడకగా సాగుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరపాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో కాళోజీ కళాక్షేత్రం పూర్తిచేయాలని కుడా అధికారులను ఆదేశించారు. పెండింగ్ బిల్లులను చెల్లించేలా చూస్తానని నాయిని రాజేందర్‌రెడ్డి హామీ ఇస్తూ రెండునెలల్లో కళాక్షేత్రం పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

స్మార్ట్‌కు మార్జిన్ నిధులు

స్మార్ట్‌సిటీ నిధుల వినియోగంపై సమావేశంలో లోతుగా సమీక్ష జరిగింది. స్మార్ట్ నిధులతో చేపట్టిన చాలా పనులు నత్తనడకగా, ముఖ్యంగా నాసిరకంగా జరుగుతుండడం పట్ల మంత్రులు, ఎమ్మెల్యే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో నిధులు ఖర్చు చేయకపోతే నిధులు వృథాఅయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తన వంతుగా ఇవ్వాల్సిన నిధులను విడుదల చేయకపోవడంవల్ల రావలసిన మిగతా స్మార్ట్ నిధులు ఆగిపోయాయని ఎమ్మెల్యే నాయిని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

ప్రభుత్వం తనవాటాగా రూ.60కోట్ల మార్జిన్ నిధులను విడుదల చేస్తే రూ.107కోట్ల వరకు వస్తాయని తెలిపారు. ఇందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువచ్చి రూ.60కోట్లు విడుదలయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

తూతూ మంత్రంగా పంట కాలువ శుభ్రం



వరంగల్ రోడ్ వైఎస్ఆర్ విగ్రహం సమీపంలో పెద్దకాల్వను శుభ్రం చేసిన దృశ్యం



తారా హోటల్ సమీపంలో కాల్వనీటిలోకి వంగిఉన్న చెట్టుకొమ్మలు

నర్సంపేట, మార్చి 12: మాధన్నపేట పెద్దకాలువలో భారీగా పేరుకు పోయిన పూడికపై సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పట్టణంలోని అంగడి సెంటర్ నుంచి వరంగల్‌రోడ్‌లోని వైఎస్ఆర్ విగ్రహం వరకు పెద్దకాల్వలో పేరుకు పోయిన పిచ్చిమొక్కలు, గుర్రపుడెక్క మొక్కలను తొలగించడంతో పాటు కాల్వలో పేరుకు పోయిన పూటిక మట్టిని తొలగించే చర్యలు చేపట్టారు. కాల్వలో పిచ్చిమొక్కలు మొలిచి, మట్టి కాల్వలో పేరుకు పోవడంతో కాల్వలో నీటి పారకం జరుగుక నీరంతా వృధాగా పోయిన విషయం, చివరి ఆయకట్టు పొలాలకు నీటి పారకం జరగని విషయం విధితమే. కాగా కొంత దూరం వరకే కాల్వలో పేరుకు పోయిన పిచ్చిమొక్కలు, మట్టిని తొలగించే చర్యలు చేపట్టి అధికారులు చేతులు దులుపుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

ఇదే రోడ్‌లోని తారాహోటల్ సమీపం నుంచి నెక్కొండ రోడ్ వరకు పెద్దకాల్వ అధ్వాన్నంగా మారింది. కాల్వకి ఇరువైపుల ఉన్న పిచ్చిచెట్ల కొమ్మలు కాల్వలోని నీటివరకు వాలడంతో నీటి పారకం సక్రమంగా జరగడం లేదని, కాల్వ ఆనవాళ్లు కనిపించడం లేదని వాపోతున్నారు. కాల్వపొడవునా పిచ్చిమొక్కలు, కాల్వలో పేరుకు పోయిన మట్టిని తొలగించి చివరి పొలాలకు నీరందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

శ్రవణ్‌కుమార్‌కు జ్యోతిష వాస్తు బ్రహ్మ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న శ్రవణ్‌కుమార్

నెక్కొండ, మార్చి 12 : జ్యోతిష పరిశీలకులు నెక్కొండకు చెందిన బూర్గుపల్లి శ్రవణ్ కుమార్ జ్యోతిష వాస్తు బ్రహ్మ బిరుదు అందుకున్నారు. హైదరాబాద్‌లోని లలిత కళాక్షేత్రం మంగళవారం ఈ అవార్డును పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో ఎస్ఎస్‌లైవ్ ఆస్ట్రో ఆర్యన్ ఆస్ట్రోలజికల్ రిసర్చ్ సెంటర్ అంతర్జాతీయ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన సెమినార్‌లో సంస్థ అధినేత డాక్టర్ నరసింహస్వామి ఈ అవార్డును ప్రదానం చేశారు. అనంతరం శాలువతో సత్కరించి జ్ఞాపికలను అందించారు. మండలంలోని అప్పల్‌రావుపేట హైస్కూల్‌లో శ్రవణ్‌కుమార్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిగా విధులను నిర్వహిస్తున్నారు. గత 16 సంవత్సరాల నుంచి జ్యోతిషవాస్తు శాస్త్రానికి అందిస్తున్న సేవలను గుర్తించి జ్యోతిష వస్తు బ్రహ్మ అవార్డును అందించారు.

మైనింగ్ తవ్వకాలను పరిశీలించిన అధికారులు



పెద్దగుట్ట పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

రాయపర్తి, మార్చి 12: మండలంలోని కొలన్‌పెల్లి, కేశవపురం, ఆరెగూడెం పరిధిలో ఉన్న పెద్దగుట్ట మైనింగ్ తవ్వకాలను మంగళవారం మైనింగ్ అధికారులు, రెవెన్యూ, కాలుష్య నియంత్రణ అధికారులతో కలిసి క్షేత్రపరిశీలన చేశారు. ఈసందర్భంగా మైనింగ్ లీజు తీసుకున్న గుత్తేదారులు లీజ్ పరిమితులను దాటి అక్రమంగా నిర్మిస్తున్న షెడ్డును అధికారులు తొలగించారు. పర్యావరణ పరిరక్షణ సమితి వారి ఫిర్యాదుమేరకు కలెక్టర్ ఆదేశానుసారం గుట్ట పరిసరాలను పరిశీలించి తుది నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. ప్రభుత్వ లీజు నిబంధనలను అతిక్రమిస్తే లీజు రద్దు చేయడానికి వెనకాడేది లేదని సదరు కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. పర్యావరణం దెబ్బ తినకుండా 33శాతం వృక్షాలను పెంచాలన్నారు, తుది నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, మైనింగ్ ఏడీ రవీందర్, కాలుష్య నియంత్రణ ఏఈ సుభాష్, మధుసూదన్, రాజు తదితరులు తెలిపారు.

అక్రమ మైనింగ్ ఆపాలని వినతి

మండలంలోని కొలన్‌పల్లి, ఆరెగూడెం, కేశవపురం శివార్లలో ఉన్న గుట్టపై అక్రమ మైనింగ్‌ను ఆపాలని బీఆర్ఎస్ నాయకులు మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దగుట్టను అక్రమంగా తొలిచేస్తూ గ్రానైట్, మార్బుల్ నిల్వలు తీస్తూ వ్యాపారుల లాభం కోసం పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, నాయకులు బిల్లా సుధీర్‌రెడ్డి, పూస మధు, నయీం, నర్సయ్య పాల్గొన్నారు.

నర్సంపేట సొసైటీ చైర్మన్‌పై చెప్పుతో దాడి



మోహన్‌రెడ్డిని చెప్పుతో కొడుతున్న మంజుల

నర్సంపేట టౌన్, మార్చి 12 : నర్సంపేట సొసైటీ చైర్మన్‌ను కాంగ్రెస్ నాయకురా లు చెప్పుతో కొట్టిన సంఘటన నర్సంపేట పట్టణంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. డీసీవో సంజీవరెడ్డి సమక్షంలో మం గళవారం పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. చైర్మన్‌తో కలిపి 13 మంది డైరెక్టర్లు హాజరయ్యారు. తీర్మానాన్ని డీసీవో ప్రారంభించగా అవిశ్వాసానికి మద్దతుగా 9 మంది డైరెక్టర్లు మద్దతు పలికారు. మిగిలిన నలుగురు అవిశ్వాసాన్ని వ్యతిరేకించారు. పూర్తి వివరాలను సేకరించి నివేదికను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు డీసీవో తెలిపారు. ఇదిలాఉండగా అవిశ్వాసాన్ని సవా ల్ చేస్తూ ఇటీవల చైర్మన్ మోహన్‌రెడ్డి ఇటీవల హైకోర్టును ఆశ్రయించగా, చైర్మన్ ఎన్నికను ఈనెల 20న కోర్టు తీర్పు అనంతరం నూతన చైర్మన్‌ను ఎన్నుకోవాలని అధికారులు సూచిస్తూ అక్కడి నుండి వెళ్లిపోయారు. ఈక్రమంలో గురిజాల గ్రామానికి చెందిన మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బండారి మంజుల కార్యాలయంలోకి చొచ్చుకొని వచ్చి మోహన్‌రెడ్డిని చెప్పుతో కొట్టి.. గతంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి వెళ్లావు, మళ్లీ అధికారం కోసం నేడు కాంగ్రెస్ లోకి రావడానికి చూస్తున్నావా.. మేమంతా ఎర్రోళ్లమా అంటూ మోహన్‌రెడ్డిపై చెప్పుతో దాడి చేసింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు.